## ఇటుక బట్టి తనిఖీ..

# చర్యలు శూన్యం.!


- అధికారుల నిర్లక్ష్యం పై ఆరోపణలు.!
- మామూళ్ల మత్తులో అధికారులు..?
- కళ్ళ ముందే మట్టి డంప్ అవుతున్న పట్టింపు లేదు.!?
- తనకు హైడ్రాని మట్టి ఇచ్చిందంటూ అబద్ధాలు.!
- బట్టీలలో బాల కార్మికులు.







**కుత్బుల్లాపూర్ : ఏప్రిల్ 25 (పీపుల్స్ న్యూస్)**
దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలో అసైన్డ్ భూములను ఆక్రమించి నిర్వహిస్తున్న ఇసుక బట్టీల వ్యాపారం స్థానికంగా తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. భారీగా పొగలు వెదజల్లుతున్న ఈ బట్టీల కారణంగా పర్యావరణ కాలుష్యం పెరిగి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం
మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ వంటి విభాగాల అధికారులు తనిఖీలు చేసేందుకు వచ్చినప్పటికీ చర్యలు మాత్రం తీసుకోవడంలో విఫలమయ్యారు. వారు తనిఖీలు చేసే సమయంలోనే నల్ల మట్టి, బొగ్గు, ఇతర సామాగ్రి దిగుమతి అవుతున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా తూతూ మంత్రంగానే బట్టీలలో పర్యటించినట్లు తెలుస్తుంది. పలు శాఖల అధికారులు బట్టీల నిర్వాహకుల నుంచి అధికారులకు లంచాలు ఇస్తున్నట్లు సదరుబట్టి నిర్వాహకుడు చంద్రబాబు చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా బట్టీల కోసం అవసరమైన మట్టి నిల్వలను కూకట్‌పల్లి పరిధిలోని ఎల్లమ్మ బండ చెరువు, నల్ల చెరువు ప్రాంతాల నుంచి హైడ్రా అధికారుల సూచనల మేరకే తాము ఇక్కడకు తెచ్చుకుంటున్నట్లు బట్టి నిర్వాహకులు చెప్పడం వింతగా ఉంది. ఒకవేళ నిజంగా హైడ్రా అధికారులు చెరువులు పూడిక తీసిన మట్టిని ఇతరులకు తీసుకువెళ్లే అవకాశం ఇస్తే తప్పనిసరిగా దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉంటాయన్న విషయం కూడా తెలియకుండా పచ్చి అబద్ధాలు చెబుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. బట్టీల నుంచి వెలువడుతున్న కాలుష్యం, అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.






ఇటికేబట్టిలు నిర్వాహకుడు చంద్రబాబు

**బట్టీలలో బాల కార్మికులు..!**
ఇటుక బట్టీల నిర్వహణ కారణంగా ప్రజలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. బట్టీల నుంచి వెలువడుతున్న దూళి, పొగల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు శ్వాసకోశ సమస్యలు, కంటి అలర్జీలు వంటి వ్యాధులతో బాధపడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇటుక బట్టీలలో మైనర్ బాలురను పనిలో పెట్టుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థను నిరోధించాల్సిన బాధ్యత ఉన్న అధికార యంత్రాంగం మాత్రం ఈ అంశంపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములలోనే ఈ ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్దేశ్యానికి విరుద్ధంగా ఇలాంటి వాణిజ్య కార్యకలాపాలు జరుగుతుండటంపై సామాజిక వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి, అక్రమ బట్టీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

